క్లుప్తంగా

పెద్ద బాలశిక్షతో విద్యార్థులకు విజ్ఞానం



పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు

పలమనేరు: పెద్దబాలశిక్ష చదవడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు కొంతసేపైనా పెద్ద బాలశిక్ష పుస్తకాన్ని చదవాలన్నారు. ఇందులో అనేక విషయాలు వున్నాయని తెలపారు. ఈ పుస్తకాన్ని ఆసక్తిగల విద్యార్థులకు ఉచితంగానే అందజేస్తున్నామని తెలిపారు.

పనిచేయని ఏటీఎంతో అవస్థలు



మూతబడిన ఏటీఎం

సదుం: స్థానిక ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఏటీఎం చాలా రోజులుగా సాంకేతిక సమస్యలతో మూతబడింది. దీంతో ఖాతాదారులతో పాటు అత్యవసర సమయాల్లో నగదు కోసం ఏమి చేయాలో అర్థం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ఏటీఎంలో నగదు జమ చేసుకోవడంతో పాటు విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఉండేది. బ్యాంకుకు వరుస సెలవులు వున్నా పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం ఏటీఎం పనిచేయకపోవడంతో నగదు వేయడానికి, తీసుకోవడానికి బ్యాంకు తెరిచే వరకు వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మహతి ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 267 మంది రోగులు వైద్య పరీక్షలు చేసుకున్నారు. వారికి కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 40 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అలాగే 20 మంది రక్తదానం చేశారు. మహతి ఫౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు, వైద్యబృందం పాల్గొన్నారు.

47 మందికి రూ.52 వేల జరిమానా

చిత్తూరు అర్బన్: ప్రమాదకరంగా వాహనాలు నడిపిన 47 మందికి పోలీసులు జరిమానా విధించారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర ఆదివారం తన సిబ్బందితో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల అత్యంత వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ పాదచారులను ఇబ్బందులకు గురిచేసిన వారిని గుర్తించారు. ఇలా 47 మందిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రూ.52 వేల జరిమానా వసూలు చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

మూసుకుపోయిన రోడ్లు

ఏదైనా రోడ్డు వస్తుందంటే గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తారు. రవాణా సౌకర్యం పెరగడంతోపాటు తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, తమ జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని భావిస్తారు. అందువల్ల తమకు జీవనాధారమైన భూములను సైతం రోడ్డుకు ఇస్తారు. పలమనేరు నియోజకవర్గం మీదుగా సిక్స్ ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తుందనగా ప్రజలు సంతోషించారు. తీరా రోడ్డు నిర్మాణం అయ్యాక తమ గ్రామాలు, పొలాలు, కాలనీలకు వెళ్లడానికి గతంలో వుండే రోడ్లు సైతం మూసుకుకోవడంతో ఎంత పనిచేసిందిరా సామీ అని బాధపడుతున్నారు. రోడ్డు దాటేందుకు వీలులేకపోవడం, పొలాల వద్దకు వెళ్లేందుకు కిలోమీటర్లు చుట్టి రావాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



పలమనేరు సమీపంలోని గడ్డూరు కాలనీకి దారి లేకుండా మూసేసిన ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు



పకీర్‌పల్లి గ్రామం వైపు వెళ్లే దారికి అడ్డంగా వేసిన ఫెన్సింగ్

- ఎక్స్‌ప్రెస్ హైవేతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- గ్రామాలు, కాలనీల వద్ద నిర్మించని అండర్‌పాస్‌లు
- కిలోమీటర్ల మేర చుట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం మీదుగా సిక్స్ ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మిస్తున్నారు. దీనికి రెండు వైపులా సిమెంట్‌తో ఎవరూ వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. అవసరమైన చోట అండర్ పాస్‌లు నిర్మించలేదు. ఫలితంగా నియోజకవర్గంలో 60 వరకు గ్రామాలు, కొన్ని కాలనీలు, పొలాల వద్దకు వెళ్లే దారులు లేకుండా పోయాయి. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో బాధిత గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత రెవిన్యూ అధికారులకు విన్నవిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళుతున్నామంటున్నారే గానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. దీంతో గ్రామాలు, పొలాలకు, పశువులను మేతకు తీసుకెళ్లడానికి ఆయా ప్రాంత వాసులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల ఎక్కడ చూసినా ఎక్స్‌ప్రెస్ హైవే సమస్యలపై బాధిత గ్రామస్తులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూనే ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవేలోకి వెళ్లేందుకు అసలుకాదు

ఎక్స్‌ప్రెస్ హైవేలోకి మనుషులు, కుక్కలు, మూగజీవాలు, ఇతర వాహనాలు వెళ్లకుండా చేయడంలో భాగంగానే కాంట్రాక్టర్లు రోడ్డుకు ఇరువైపులా సిమెంట్‌తో అడ్డుగా ఫెన్సింగ్‌ని నిర్మిస్తున్నారు. ఇతర రోడ్లకు కనెక్టింగ్ పాయింట్ ఉంటుందో అక్కడ తప్ప ఎవరూ దీనిపైకి వెళ్లడం సాధ్యం కాదు. అవసరమైన చోట్లలో మాత్రం అండర్ పాస్‌లు నిర్మించకపోవడం సమస్య మొదలైంది.

కాలనీ ఇళ్లకు దారేది

పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు, బోడిరెడ్డిపల్లి ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో సుమారు నాలుగువేల కుటుంబాలున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవే రాకముందు ఇక్కడి ప్రజలు కూర్మాయి రోడ్డు, 80 అడుగుల రోడ్డులో వెళ్లేవారు. ఈ రోడ్ల మధ్య ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవే రావడంతో కాలనీకి దారిలేకుండా పోయింది. వీరు తావడపల్లి రోడ్డులోగాని, అటు కౌండిన్య వైపు నుంచి వెళ్లేందుకు అవకాశం లేకుండా అష్టదిగ్బంధంలో చిక్కుకున్నారు. మరోవైపు గడ్డూరు వద్ద అండర్‌పాస్ నిర్మాణం లేకుంటే కూర్మాయి మార్గం ద్వారా పలమనేరు రూరల్ మండలంలోని 20 గ్రామాలకు ఇబ్బందులు తప్పవు. అదే విధంగా మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో నిర్మించిన జగనన్న కాలనీకి దారి లేకుండా పోయింది. వీరు మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి వెళ్లాలంటే నాలుగైదు కిలోమీటర్ల చుట్టాల్సి వస్తోంది.



ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల దారి లేదని నిరసన తెలుపుతున్న బైరెడ్డిపల్లి మండలం గడ్డూరు గ్రామస్తులు (ఫైల్)

ఎన్నో గ్రామాలు, కాలనీలకు ఇదే పరిస్థితి..

ఎక్స్‌ప్రెస్ హైవే కర్ణాటక రాష్ట్రంలోని హులుక్కూర్ నుంచి వీకోట మండలంలో ప్రవేశిస్తోంది. అక్కడి నుంచి బైరెడ్డిపల్లి, పలమనేరు, బంగారుపాళెం, గుడిపాల మండలాల మీదుగా తమిళనాడుకు వెళుతోంది. ఈ మార్గాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలు, పొలాల వద్దకు వెళ్లే దారులు ఇప్పుడు లేకుండా పోయాయి. పలమనేరు మండలంలోని దిగువకల్లాడు, ఎగువ కల్లాడు, నడిమికల్లాడు, గజ్జలవారిపల్లి మీదుగా పకీరుపల్లికి దారి లేకుండా పోయింది. మరోవైపు ఎక్స్‌ప్రెస్ హైవే గ్రామాల నుంచి పొలాల వద్దకు వెళ్లే వందలాది కాలి బాటలు లేకుండా పోయాయి. దీంతో పొలం పనులకు, పశువుల మేతకు ఎలా వెళ్లాలో దిక్కుతోచక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, దారులు, కాలనీలున్న చోట అండర్‌పాస్‌లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అండర్ పాస్‌ల విషయం అప్పట్లో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వాహకులు ప్రతిపాదించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. దీనిపై ఎన్‌హెచ్ అధికారులను అడిగినా తమకు సంబంధం లేదని చెబుతున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



పశుసంరక్షణ కిట్లతో శ్రీజ డెయిరీ సభ్యులు

వి.కోట: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా శ్రీజ డెయిరీ పనిచేస్తోందని డెయిరీ ఏరియా పీఏబీ ఎగ్జిక్యూటివ్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని పట్రపల్లి కొత్తూరు గ్రామంలోని డెయిరీ సభ్యులకు ఆదివారం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పశుసంరక్షణ కిట్లు, పశుగ్రాసం కోసం సీడ్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీజ డెయిరీలో పాలు పోసే సభ్యుల నుంచి బోర్డు డైరెక్టర్ వరకు అందరూ మహిళలే ఉన్నారని తెలిపారు. ఈ డెయిరీ పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. మహిళల సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. శ్రీజ మహిళ పాల యజమానులకు వాళ్ల అర్హతను బట్టి 2024–25 ఆర్థిక సంవత్సరంలో బోనస్‌గా లీటర్‌కు 0.60 పైసలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ ఏరియా సూపర్ వైజర్స్ నాగరాజ్, కిషోర్‌రెడ్డి, పాలమిత్ర నారాయణ స్వామి పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని కట్టక్రింద పాళెం, చింతలవీధి, నగిరివీధి ప్రాంతాల్లో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్–6 పేరుతో అరకొరగా పథకాలు అమలుచేస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ క్రమంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తామని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: పీలేరుకు చెందిన అబ్దుల్ నజీర్ కుమారుడి వివాహం ఆదివారం రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లులోని వీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రొంపిచెర్ల జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, పీలేరు సర్పంచ్ హబీబ్‌బాషా, ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయాలి



ఎస్టీయూ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పలమనేరు: సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా కూటమి సర్కార్ నిర్వాకంతో ధరలు ఆకాశానంటుతున్నాయని, ఈ తరుణంలో ఉపాధ్యాయులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటామోహన్ తెలిపారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం కుబేరనాయుడు అధ్యక్షతన ఆ సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిగా పీఆర్సీ చైర్మన్‌ను నియమించకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. డీఏ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ ప్రభుత్వంలో బోధనేతర కార్యక్రమాల వల్ల టీచర్లకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ యాదవ్, పురుషోత్తం నాయుడు, పలమనేరు డివిజన్ నాయకులు రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఆగడాలకు స్వస్తి పలకాలి



మోసం గ్యారెంటీ పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు, వేధింపులు, అరెస్టులు తప్ప ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించింది ఏమి లేదని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమంతోపాటు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. ఆయన ఆదివారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్ పుంగనూరు పట్టణంలోని ఎన్‌ఎస్.పేట, వనమలదిన్నె రోడ్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలు, సూపర్–6 హామీల అమలు, ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, వైఫల్యాలను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేశారు. కూటమి పాలనలో ఏ ఒక్కరూ సంతృప్తి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరు మార్చుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, సీమ జిల్లాల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫకృద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, జయరామిరెడ్డి, రాజేష్, సురేష్, రాఘవ, ఎంఎం.ఆనంద, అస్లాంమురాధి, హేమంత్, శ్రీనివాసులు, మమ్ము, ఖాదర్, నయాజ్, అయాజ్, జావీద్, సలామత్, కంచప్ప తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాజ్యాధికార సాధనే లక్ష్యం



బహుజన సమాజ్ పార్టీ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సురేంద్రబాబు, నాగరాజు

పుంగనూరు: రాజ్యాధికారాన్ని సాధించుకునేందుకు బహుజనులంతా ఐకమత్యంతో పోరాటం చేద్దామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగరాజు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబుతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బుక్‌లెట్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇందుకోసం రాజ్యాధికారం తప్పనిసరని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలు వేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. బహుజనులను ఏకతాటిపైకి తీసుకొచ్చి రాజ్యాధికారాన్ని సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



దుర్యోధనుడు, భీమసేనుడి యుద్ధ సన్నివేశం

ఐరాల: మండలంలోని మద్దిపట్లపల్లెలో శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతోపాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి మట్టి ప్రతిమ చూపరులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారులు యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. అదేవిధంగా దుర్యోధునుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అనంతరం భీముని వేషధారి దుర్యోధనుడిని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

వైభవంగా సుబ్రమణ్య స్వామి ఊరేగింపు



సదుంలో ఊరేగుతున్న సుబ్రమణ్య స్వామి

సదుం: మండల కేంద్రంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యా స్వామి ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు పట్టి నీరాజనాలు పలికి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రవీంద్ర రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: సూపర్ సిక్స్ పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి కలుగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. గతంలో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేశారని గుర్తు చేశారు. మహిళలకు పెద్ద పీట వేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, కరీముల్లా, విజయశేఖర్, రవీంద్ర, చంద్రారెడ్డి, నీరజాక్షులు నాయుడు, ప్రేమానందం, వెంకటరత్నం, సిద్ధరామిరెడ్డి, కమలాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదం జరిగినా పట్టించుకోరా..?





చౌడేపల్లె మండలం కాగతి చెరువులో ఒక వైపునకు వాలిపోయిన 11 కేవీ విద్యుత్ స్తంభాలు, కొలింపల్లె సమీపంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

- కాగతిచెరువులో ప్రమాదకరంగా వాలిన 20 విద్యుత్ స్తంభాలు
- ఆందోళనలో రైతులు, ప్రజలు
- డ్రైవర్ మృతిచెందినా పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ–పుంగనూరు రోడ్డులోని కొలింపల్లె సమీపంలోని ఒడ్డోళ్ల తోట సమీపంలో మూడు రోజుల క్రితం టెంపోలో జేసీబీను తరలిస్తుండగా 11 కేవీ విద్యుత్ లైను తగిలి డ్రైవర్ సుబ్రమణ్యంరెడ్డి మృతిచెందాడు. ఇక్కడ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వున్నాయి. అంతేగాక మండలంలోని కాగతి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి కాగతి చెరువు మీదుగా యనమసామనపల్లె, పలగార్లపల్లె, పొన్నిపెంట ప్రాంతాలకు 11 కేవీ లైను వెళుతోంది. చెరువులో నాటిన విద్యుత్ స్తంభాలు 20 వరకు ఒక పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా వున్నాయి. ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులోకి నీరు చేరితే పెద్ద ప్రమాదం ఏర్పడే ప్రమాదం వుందని పరిసర ప్రాంతంలోని పంటలు సాగుచేసిన రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగి ఒక వ్యక్తి మృతిచెందినా ట్రాన్స్‌కో అధికారుల్లో చలనం రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా చివరి రోజున భక్తులు స్వామి వారికి బాల కావళ్లు చెల్లించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయంలో కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. తదుపరి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పెద్ద గొల్లపల్లె గ్రామంలో ఊరేగించారు.



ఆలయంలో బాల కావళ్లతో భక్తులు